# కరువుకు 'చెక్'డ్యాం

- వీణవంక వాగుపై రూ.10 కోట్లతో ఐదు చోట్ల నిర్మాణం
- నేడు పంటలతో కళ కళ లాడుతున్న మండలం



వీణవంకలో మత్తడి పడుతున్న చెక్‌డ్యాం

వీణవంక, నవంబర్ 13: తలాపున సముద్రం ఉన్నా చాప దూపకు ఏడ్చినట్లు ఉండేది ఒక ప్పుడు వీణవంక ప్రాంత రైతులు, ప్రజల పరిస్థితి. పది గ్రామాలను ఆనుకుని వాగు ఉన్నా నీరు నిలువని కారణంగా ఏటా కరువు ఛాయలు కమ్ముకునేవి. ఇక ఎండాకాలం వచ్చిందంటే కనీసం తాగడానికి నీళ్లు దొరకక ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే స్వరాష్ట్రంలో ఈ దుస్థితి దూరమైంది. సీఎం కేసీఆర్ ఆలోచన ఇక్కడి రైతులు, ప్రజలకు వరంగా మారింది. చెక్‌డ్యాంలు నిర్మించి వర్షాకాలంలో వీణవంక వాగులో ప్రవహిస్తున్న నీటిని ఆపడంతో నేడు ఈ ప్రాంతం సస్యశ్యామలమైంది. వీణవంక వాగుపై వీణవంక, రామకృష్ణాపూర్, బ్రాహ్మణపల్లి, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో రూ.10 కోట్లతో మొత్తం 5 చెక్‌డ్యాంలు నిర్మించడంతో బంగారు పంటలు పండుతున్నాయి. వర్షాకాలంలో వరదతో పాటు, కల్వల చెరువు ద్వారా ఎస్సారెస్పీ నుంచి విడుదల చేసిన నీరు ఆయా చెక్‌డ్యాంలలో నిలుస్తుండడంతో కాలమేదైనా వాగు నిండుకుండను తలపిస్తుండగా, రైతులు, ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

### ఎడ్ల జంబుతో పర్రెలు తోడేది



తెలంగాణ సర్కారు రాక ముందు రైతుల బాధలు అంతాఇంత గాదు. నీళ్లు లేక ఏసిన పంట ఎక్కడ ఎండిపోతదో అని ఎడ్లకు జంబుగట్టి రెండు, మూడు గొలల పర్రెలు తవ్వేది. ఆ నీళ్లు గంటసేపు పొయ్యంగనే అయిపోయేటియి. మళ్లా నీళ్లు ఊరేదాక ఆగి అక్కడే కావలి ఉండి పంటకు వెట్టుకునెటోళ్లం. ఏసిన పంట సేతికి అచ్చేటాళ్లకు ఏడుజెర్ల నీళ్లు తాగినట్టు అయ్యేది. సీఎం కేసీఆర్ పుణ్యమా అని మా ఊరి వాగు మీద చెక్‌డ్యాం కట్టిండు. వాన నీళ్లు అక్కడే ఆగి ఎప్పుడు జూసినా నిండుకుండలెక్క చెక్‌డ్యాం కనవడుతంది. రెండు పసల్లకు నీళ్లరందీ తప్పింది.

*-కోరె నాదం, రైతు (రామకృష్ణాపూర్)*

### బావులు తవ్వే బాధ తప్పింది



వ్యవసాయం చేయాలంటే వ్యవసాయ బావి తప్పకుండా ఉండాలె. ప్రతీ సంవత్సరం పూటిక తియ్యాలె. నీళ్ల కోసం ఏటా రూ.20 వేలు ఖర్చు చేయాలె. ఇవ్వన్నీ ఎవలు చేస్తరని వ్యవసాయం జోలికి పోలేదు. గేదెలు తీసుకొని కుటుంబ పోషణ కోసం పాల వ్యాపారం చేసిన. సీఎం కేసీఆర్ చెక్‌డ్యాం కట్టించడంతో ఎప్పుడూ నిండా నీళ్లు ఉండడంతో బావి జోలికి పోవాల్సిన అవసరం లేకుండా వాగులో మోటర్ పెట్టుకొని వ్యవసాయం చేస్తున్న. నీళ్లు అయిపోయినప్పుడు కాళేశ్వరం నీళ్లు ఎస్సారెస్పీ ద్వారా విడుదల చేస్తే చెక్‌డ్యాంలకు వస్తున్నయి.

*-వోరె సాగర్, యువ రైతు (వీణవంక)*

# ఓటమి భయంతోనే కాంగ్రెస్ దాడులు

- ఢిల్లీ చేతుల్లో పెడితే పచ్చబడ్డ తెలంగాణను కాల్చుకుతింటరు
- క్లచ్, బ్రేకుల్లేని బండిలాంటిది ఆ పార్టీ
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి

హుజూరాబాద్, నవంబర్ 13: ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులపై దాడులకు పాల్పడుతున్నదని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని సిటీ సెంట్రల్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రం శాంతియుతంగా ఉందని, ఇది ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు అరాచకపాలన తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, గువ్వల బాలరాజుపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ప్రజాక్షేత్రంలో ప్రజల మెప్పుపొందాలే కాని, ఇలాంటి దాడులకు పాల్పడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నానని, ప్రజాస్వామ్యవాదులు ఇలాంటి చర్యలను తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ క్లచ్, బ్రేకుల్లేని బండి లాంటిదని, స్టీరింగ్ ఢిల్లీలో ఉంటే క్లచ్, బ్రేకులు కన్నడిగుల చేతుల్లో ఉంటాయని విమర్శించారు. అటువంటి పార్టీని నమ్ముకుంటే నిండా మునగడం ఖాయమన్నారు. పదిహేను అంశాలతో కూడిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ముందు కాంగ్రెస్ చెబుతున్న ఆరు గ్యారంటీలు బలాదూర్ అని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తానంటుంటే, కాంగ్రెసోళ్లు రూ.500కు ఇస్తానంటే ఓట్లు ఎలా పడతాయని ప్రశ్నించారు. దేశంలోని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా రైతుబంధు ఇవ్వకుండా ఇక్కడ ఎకరానికి రూ.5వేలు ఇస్తానని చెప్పడం నమ్మశక్యంగా లేదన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు ఇచ్చి చూపెడుతుంటే, దానిని రూ.16వేలకు పెంచుతామని చెబుతుంటే మిమ్మల్ని (కాంగ్రెసోళ్లను) ఎవరు నమ్ముతారని ఎద్దేవా చేశారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో స్వపరిపాలన ముద్దు అని పరాయి పాలన వద్దనేలా ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ నాయకుల మాటలకు మోసపోవద్దని, పచ్చగున్న తెలంగాణను ఢిల్లీ చేతుల్లో పెడితే కాల్చుకుతింటరని హెచ్చరించారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌నేనని, ఇది వందశాతం జరిగి తీరుతుందని జోస్యం చెప్పారు. అయితే ఇతర పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే అభివృద్ధి ఎలా జరుగుతుందని, దీని గురించి ఆలోచన చేయాలని విన్నవించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనబడుతున్నదని.. అభివృద్ధి చేయనోళ్లు, ప్రజల బాగోగుల గురించి పట్టించుకోనోళ్లు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, నాయకులు పార్టీ మండల, టౌన్ అధ్యక్షులు సంగెం ఐలయ్య, కొలిపాక శ్రీనివాస్ నాయకులు క్రషర్ రవీందర్‌రావు, తాళ్లపల్లి శ్రీనివాస్, ముక్క రమేశ్, మక్క కుమార్, చందా గాంధీ, మొలుగూరి ప్రభాకర్, తులసి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నోము కోసం వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

జమ్మికుంట, నవంబర్13: రోడ్డు ప్రమాదంలో కోడెం సువర్ణ(35)అనే వివాహిత మృతి చెందింది. జమ్మికుంట పట్టణ సీఐ బర్పాటి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన సువర్ణకు జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామానికి చెందిన కోడెం శ్రీనివాస్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికిద్దరు కొడుకులున్నారు. వారి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. భర్త శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దీపావళి సందర్భంగా సైదాబాద్‌లో నోముల కోసమని భార్యాభర్తలిద్దరూ ద్విచక్ర వాహనంపై జమ్మికుంటకు వస్తున్నారు. ఈ క్రమంలో జమ్మికుంట శివారులోని అయ్యప్ప దేవాలయం సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పింది. సువర్ణ వాహనంపై నుంచి కింద పడింది. తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆమె మృతి చెందింది. మృతురాలి సోదరుడు పొరండ్ల భీంరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

# ఎన్నికల్లో పారదర్శకంగా విధులు నిర్వహించాలి

- ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహనాల తనిఖీలు చేయాలి
- ఓటర్లకు భద్రతా భావాన్ని కలిగించేలా విధులు చేపట్టాలి
- విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి
- జమ్మికుంట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

జమ్మికుంట, నవంబర్13: సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది విధులను పారదర్శకంగా నిర్వహించాలని, వీలైంత వరకు ఎక్కువగా ఫ్లాగ్‌మార్చ్, రూట్ మార్చ్, వాహనాల తనిఖీలు చేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోగల సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెట్టాలని, ఓటర్లకు భద్రతా భావాన్ని కలిగించేలా విధులుండాలని సూచించారు. సోమవారం ఆయన జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేరస్తులు, రౌడీ షీటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బంది, వారికి కేటాయించిన ప్రాంత పరిధి గురించి అడిగారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. గతంలో జరిగిన ఎన్నికల సమయంలో గొడవలు చేసిన, అల్లర్లు సృష్టించిన, ప్రజలను భయబ్రాంతులకు గురి చేసిన, నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తులను బైండోవర్లు, తదితర వివరాలు అడిగారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ఎన్నికలపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.. ఓటర్లను ప్రభావితం చేసే ఎన్నికల నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు చేసే వ్యక్తులను బైండోవర్లు చేయాలని చెప్పారు. బైండోవర్లు ఉల్లంఘిస్తే పూచీకత్తు సొమ్ము జప్తు చేయాల్సి వస్తుందని, జైలు శిక్ష కూడా పడుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, విధు ల్లో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు, వ్యక్తులకు అతీతంగా, నిష్పక్షపాతంగా పారదర్శకంగా పక్కాగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సీపీ వెంట హుజూరాబాద్ ఏసీపీ ఎల్ జీవన్‌రెడ్డి, జమ్మికుంట సీఐ బర్పాటి రమేశ్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

# దీపావళి వేడుకల్లో మండలి విప్ 'పాడి'

వీణవంక, నవంబర్ 13: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. పటాకులు కాల్చి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండాయే

- అన్ని వర్గాల మద్దతు బీఆర్ఎస్‌కే
- బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి



మాట్లాడుతున్న రావుల రాజలింగారెడ్డి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్13: ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని, హుజూరాబాద్‌లో ఎగిరేది గులాబీ జెండాయేనని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం హుజూరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు నిధుల మంజూరులో వివక్ష చూపడాన్ని ప్రజలు మరచిపోరని పేర్కొన్నారు. ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీ మారిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఇక్కడి ప్రజలు ఈ ఎన్నికల్లో రాజకీయ సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ నేతలు కుట్రలు చేసి వారి కార్యకర్తలను కూడా అవసరమైతే కాంగ్రెస్‌కు ఓటు వేయండి కానీ, బీఆర్ఎస్‌కు వేయవద్దని ఆదేశించడం దుర్మార్గమైన చర్య అన్నారు. తెలంగాణపై వివక్ష చూపుతున్న మోదీ సర్కారుపై యుద్ధం ప్రకటించిన కేసీఆర్‌ను తెలంగాణ అధికారంలోకి రాకుండా బీజేపీ కేంద్ర, రాష్ట్ర నేతలు కలిసి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు అండగా నిలువాలని కోరారు. నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని రాజలింగారెడ్డి సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ, బీఆర్ఎస్‌పై కుట్రలకు ఇకనైనా స్వస్తి పలుకాలని, లేకుంటే ఈ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ అజ్జుదుల్లా ఖాన్, ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.